ఉదయం ఉక్కపోత.. సాయంత్రం కుండపోత

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలో బుధవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కురవటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాలుగు రోజులుగా, ఉక్కపోత, అధిక వేడితో ఇబ్బంది పడుతున్న జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఖమ్మం సహా రఘునాథపాలెం, వైరా, కూసుమంచి, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో పెనుగాలులు వీచాయి. ఈ తీవ్రతకు వైరా మండలం పాలడుగు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు పడిపోయింది. మధిర, వైరా మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో రాత్రి 7 గంటల వరకు నమోదైన వివరాల మేరకు.. రఘునాథపాలెంలో అధికంగా 51.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మధిర గొంది-37.3, పెనుబల్లి-36.5, పల్లెగూడెం-36.3, ఖమ్మంలో ఖానాపురం పోలీస్ స్టేషన్-34.0, తిరుమలాయపాలెం-33.0, పమ్మి-24.0, వి.వి.పాలెం న్యూ కలెక్టరేట్-23.5, తల్లాడ-23.0, ఖమ్మం ప్రకాశ్‌నగర్-20.0, చింతకాని-13.3, బచ్చోడు-10.8, గుబ్బగుర్తి-9.8, సదాశివునిపాలెం-8.5, కాకరవాయి-8.3, కుర్నవల్లి-8.0, పంగిడి-7.8, పెద్దగోపతి-6.3, కూసుమంచి-6.0, బాణాపురం, మంచుకొండ-5.5, గేట్ కారేపల్లి-3.0, నేలకొండపల్లి-2.8, లింగాల-2.3, నాగులవంచ-1.5, సిరిపురం, కొణిజర్ల-1.0, తిమ్మారావుపేట, వైరా-0.8, రావినూతలలో 0.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.


వైరా, బోనకల్లు మండలాల సరిహద్దులో రోడ్డుపై పడిన చెట్టు


ఇక సర్వేత్రా..
సమాచారం నిక్షిప్తం

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డు రూపకల్పన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పది శాసనసభ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా 20 ప్రాంతాల్లో ఇంటింటి సర్వేకు అధికారులు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం వరకు సర్వే జరగనుంది. రేషన్, ఆరోగ్య, సంక్షేమ పథకాలకు ఉపయోగపడేలా కార్డులను రూపొందించి లబ్ధిదారులకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులోనే కుటుంబ సభ్యుల ఆరోగ్య సమాచారం పొందుపరచనున్నారు.

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో..

డిజిటల్ కార్డుల రూపకల్పన పైలట్ ప్రాజెక్టును పకడ్బందీగా నిర్వహించేందుకు ఉభయ జిల్లాలకు ఐఏఎస్ స్థాయి ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. వీరి పర్యవేక్షణలోనే సర్వే సాగనుంది. వీరికి సహాయకులుగా ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారి, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవోలతో కూడిన ప్రత్యేక బృందాలు పనిచేయనున్నాయి. నియోజకవర్గం నుంచి ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేసిన అధికారులు ఆయా చోట్ల నివసిస్తున్న కుటుంబాల సంఖ్య ఆధారంగా సర్వే ప్రణాళికలు రూపొందించారు. ఐదు రోజుల్లో సర్వే పూర్తిచేయటానికి అవసరమైతే అదనపు బృందాలను నియమించనున్నారు.



సర్వే సాగనుందిలా..

డిజిటల్ కార్డుల సర్వేలో భాగంగా కుటుంబంలో ఎంతమంది ఉన్నారు? వారి మధ్య ఉన్న సంబంధం ఏంటి అనే వివరాలు నమోదుచేయనున్నారు. కుటుంబంలో ఎక్కువ వయసు కలిగిన మహిళలు కుటుంబ పెద్దగా ఉండనున్నారు. కుటుంబంలోని ప్రతి సభ్యునికి గుర్తింపు సంఖ్య ఇస్తారు. కుటుంబంలోకి కొత్తగా వచ్చిన, జన్మించిన పిల్లల వివరాలు నమోదు చేయటంతో పాటు వివాహం చేసుకొని ఇతర చోటుకు వెళ్లిపోయిన లేదా చనిపోయిన వారి వివరాలు తొలగించనున్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో బృంద ఫొటో తీసుకోనున్నారు.

> కుటుంబ డిజిటల్ కార్డు సర్వేకు అన్ని చర్యలు తీసుకున్నాం. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు గురువారం నుంచి సర్వే నిర్వహించనున్నాయి.
> – డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

చేపా.. చేపా.. ఈసారైనా ఎదుగుతావా?

ఈటీవీ, ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ పథకం ఎట్టకేలకు శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఎంపిక చేసిన చెరువుల్లో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు. గతేడాది చేపపిల్లల సరఫరాలో గుత్తేదారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చేపపిల్లల సైజు, సంఖ్యలో భారీగా వ్యత్యాసమున్నట్లు ఖమ్మం కలెక్టర్ తనిఖీల్లో బయటపడింది. గుత్తేదారుల నిర్వాకంతో చేపపిల్లల ఎదుగుదల లేకపోవటంతో అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసారైనా అలాంటి పొరపాట్లకు తావులేకుండా చేపపిల్లలను సరఫరా చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

లక్ష్యం ఇలా..

ఖమ్మం జిల్లాలో వాస్తవానికి 3.62 కోట్ల చేపపిల్లలను సరఫరా చేయాల్సి ఉండగా ఈసారి 1.75 కోట్లకు, భద్రాద్రి జిల్లాలో 1.77 కోట్ల చేపపిల్లలకు గాను 88 లక్షలకు లక్ష్యాన్ని కుదించింది.



	ఖమ్మం	భద్రాద్రి
మత్స్య సహకార సంఘాలు	210	63
సభ్యులు	16,500	2,963
చెరువులు	864	743
ఈ ఏడాది వదిలే చేపపిల్లలు	1.75 కోట్లు	88 లక్షలు

గతంతో పోలిస్తే ఈసారి దాదాపు రెండు నెలల తర్వాత చేపపిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుండటంతో లక్ష్యం తగ్గింది. పాత బకాయిలు చెల్లించలేదన్న సాకుతో టెండర్లకు గుత్తేదారులు నిరాసక్తత ప్రదర్శించటం, వర్షాకాలానికి ముందే జరగాల్సిన టెండర్ ప్రక్రియ సెప్టెంబర్‌లో ముగియటంతో ఈసారి చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు

ఉభయ జిల్లాల్లో గతేడాది చేపపిల్లల సరఫరాలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. టెండర్ ప్రకారం కన్నా తక్కువ సైజు చేపపిల్లలు పంపిణీ చేశారని, సంఖ్యలోనూ భారీగా వ్యత్యాసముందని అధికారులు గుర్తించారు. చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసీజన్‌లో భారీ వర్షాలు కురవటంతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే చేపపిల్లల సరఫరా పారదర్శకంగా సాగుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

> జిల్లాలో పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. ఎంపిక చేసిన చెరువుల్లోనూ క్రమక్రమంగా చేపపిల్లలను వేస్తాం. అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గుత్తేదారులు నిబంధనల ప్రకారం సైజు, సంఖ్య తగ్గకుండా చేపపిల్లలు సరఫరా చేసేలా పర్యవేక్షిస్తాం.
> – శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

పోటీలకు సై

● రాష్ట్రస్థాయి క్రీడలకు జిల్లా జట్లు సిద్ధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జట్లను ఎంపిక చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోటీలు నిర్వహించి ఉమ్మడి జిల్లాల నుంచి ఒక జట్టును రాష్ట్రస్థాయికి పంపుతారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పూర్తయింది. మిగతా క్రీడాంశాల్లో ఎంపిక చేయాల్సి ఉంది. పాఠశాల క్రీడలు నిర్వహించే 'రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య' రాష్ట్రంలోని పాత పది జిల్లాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర టోర్నీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తుంది. పాఠశాల క్రీడా సమాఖ్య జాబితాలో 46 క్రీడాంశాలు ఉన్నాయి. రెండు జిల్లాలోని జిల్లా క్రీడా సమాఖ్యలు చెరి 23 అంశాల పోటీలు నిర్వహించుకోవాలని ఒప్పందం చేసుకున్నాయి. వీటిలో క్రీడా జట్లు ఎక్కువగా ఉండే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాలకు మాత్రమే పోటీలు నిర్వహించారు. మిగిలిన అంశాల్లో ఎంపికలు జరగనున్నాయి.



ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు కొత్తగూడెంలో నిర్వహించగా అండర్-17 క్రికెట్ జట్టుకు ఖమ్మంలో పోటీలు జరగనున్నాయి. ఇలాంటి ఎంపికలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రాంతంలో జరిగినా ఆయా ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుంది. ఇలా ఎంపికల ద్వారా సిద్ధం చేసే జట్టు, ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుగా రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఇంటర్ విద్యార్థులకూ అవకాశం

ఇంటర్మీడియట్ విద్యార్థులను అండర్-19 విభాగంగా పరిగణిస్తున్నారు. వీరిని ప్రత్యేకంగా నిర్వాహక కమిటీ, ఇంటర్మీడియట్ విద్యాధికారి పర్యవేక్షిస్తారు. ఇంటర్‌లో చేరిన విద్యార్థులు 17 ఏళ్లలోపు ఉంటే పాఠశాల అండర్-17 జట్లలో పాల్గొనేందుకు అర్హులు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారికి అండర్-17 పోటీలు, ఎంపికల్లో పాల్గొనే అవకాశం ఉంది.

మార్పులు ఇలా..

2019 కొవిడ్ విధ్వంసం తర్వాత ఈఏడాది తొలిసారిగా ఉభయ జిల్లాల్లో పాఠశాల క్రీడలు జరిగాయి. ఇంకా జిల్లా జట్లను సిద్ధం చేసేందుకు ఎంపికల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ చొరవ తీసుకొని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఓ ప్రత్యేక కార్యాలయ వసతి కల్పించారు. దశాబ్దాలుగా ఓ కార్యాలయం లేకుండానే సమాఖ్య పనులు సాగించింది. ఈ ఏడాది ఖమ్మంలో నాలుగు అంశాలకు పరిమితంగా జిల్లా క్రీడలు నిర్వహించినప్పటికీ క్రీడాకారులకు భోజన వసతి కల్పించి, బాలికలు, బాలురకు విడివిడిగా పోటీలు జరిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్ల ఎంపికల ప్రక్రియ మొదలు పెడతామని, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పూర్తి సమాచారం కోసం తమను సంప్రదించాలని జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి నర్సింహమూర్తి తెలిపారు.

వాన జల్లులు.. పూల హరివిల్లులు


ఖమ్మం: విజయనగర్ కాలనీ సాయిబాబా గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బుర్హాన్‌పురం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో..

వాన చినుకుల్లో మహిళలు సందడి చేశారు. బుధవారం రాత్రి నగరంలో చిన్న బతుకమ్మ సందడి నెలకొంది. సాయంత్రం నుంచి జోరువాన కురవడంతో మహిళలు, యువతులు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. 7 గంటల తరువాత కొంత తెరపి ఇవ్వడంతో వేడుకగా బతుమ్మ ఆడారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్లలో సందడి నెలకొంది. ప్రభుత్వం తరఫున ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీశిశు సంక్షేమశాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ, స్త్రీ, శిశు సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఏడీఎంసీ సుజాత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

–ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా జరిగింది. 206 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. ఎర్రుపాలెం, మధిర, వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, బోనకల్లు, వైరా తదితర ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో నలుగురు ఉర్దూ మాధ్యమం వారునారు. ఎంపికైనట్లు పది మంది చరవాణి నంబర్లకు సమాచారం వచ్చినా జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్థానిక అధికారులు చెప్పారు. కొంతమంది చంటి పిల్లలతో హాజరుకావడం విశేషం. ఉమ్మడి జిల్లా పరిశీలకుడు, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖరశర్మ పాల్గొన్నారు.


పరిశీలన కేంద్రంలో విద్యాశాఖ జేడీ శ్రీనివాసాచారి, చిత్రంలో డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు

మహాత్ముడి జీవితం అందరికీ ఆదర్శం: కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ జీవితం అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గాంధీజీ చూపిన మార్గంలో పయనించాలన్నారు. కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ నివాళి అర్పించారు. గాంధీ సత్యం, అహింస మార్గాల్లో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్ముడు అని కొనియాడారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి నివాళి అర్పించారు. జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

హింసకు పర్యవసానం జైలే..: జిల్లా జడ్జి

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సర్వ మానవాళి అహింసా సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలని, హింసకు పాల్పడితే పర్యవసానం జైలుకెళ్లడమేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దానవాయిగూడెంలోని జిల్లా జైలును బుధవారం సందర్శించిన ఆయన 'ఖైదీల సంక్షేమ దినోత్సవం' కార్యక్రమంలో ప్రసంగించారు. అహింస, ప్రేమతో సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. మహాత్ముడు అహింస మార్గంలో స్వాతంత్ర్యం సాధించారని గుర్తు చేశారు. జైలులో ఉండాల్సి వచ్చినప్పుడు సమయాన్ని సద్వినియోగం చేసుకుని మహాత్మాగాంధీ ఎన్నో రచనలు చేశారని, జైలులో ముద్దాయిలు కనీసం పుస్తక పఠనం చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాసంస్థ నుంచి సుప్రీం కోర్టు వరకు నిరంతరం ఖైదీల సంక్షేమం కోసం ఆలోచిస్తుంటాయని తెలిపారు. వారంలో నాలుగు రోజులు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ప్రతినెలా న్యాయ సేవాసంస్థ న్యాయమూర్తి, మూడు నెలలకోసారి తాను జిల్లా జైలును సందర్శిస్తున్నట్లు వివరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు జిల్లా జడ్జి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి శ్రీధర్, న్యాయ సేవా సంస్థ న్యాయమూర్తి కె.వి.చంద్రశేఖర్‌రావు, సబ్ జైలు అధికారి జి.వెంకటేశ్వర్లు, జైలర్లు సక్రు నాయక్, లక్ష్మీనారాయణ, సుభాష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా జడ్జి జి.రాజగోపాల్, చిత్రంలో న్యాయ సేవాసంస్థ న్యాయమూర్తి కె.వి.చంద్రశేఖర్‌రావు, జైలు పర్యవేక్షణాధికారి ఎ.శ్రీధర్ తదితరులు

ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రారంభం

కారేపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు ఉన్నతంగా తీర్చిదిద్దాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. రేలకాయలపల్లిలో నిర్మించిన ఏకలవ్య గురుకుల పాఠశాలను వర్చువల్ విధానంలో దిల్లీ నుంచి ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మరిన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ.. భవనంలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. 15 రోజుల్లో అన్ని తరగతులు ఇక్కడి నుంచే జరగాలని ఆదేశించారు. పలువురు విద్యార్థినులు బంజార నృత్యాలతో అలరించారు. పాఠశాలల రీజినల్ డైరెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దారు సంపత్‌కుమార్, ఎంపీడీఓ రమేశ్, ప్రధానాచార్యుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రారంభమైన కొద్ది నిమిషాల వ్యవధిలో భారీ వర్షం కురిసింది. ప్రాంగణంలోని రహదారులు, మురుగు కాల్వల్లో నీరు స్తంభించటం గమనార్హం.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, చిత్రంలో ఐటీడీఏ పీఓ రాహుల్ తదితరులు


ప్లాస్టిక్ వ్యాప్తికి ఇటుకతో సమాధి!


ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

నిషేధిత ప్లాస్టిక్‌ను ఎందుకు వినియోగిస్తున్నారని ఎవరినైనా ప్రశ్నిస్తే.. 'నేనొక్కడినే మారితే సరిపోతుందా ఏంటి'.. అనే సమాధానం వస్తుంది. ఇలా ఒక్కొక్కరుగా చూపే నిర్లక్ష్యమే చివరకు ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని కబళించేలా చేస్తోంది. దశాబ్దంన్నర క్రితం వరకు పెద్దగా వాడకం లేని నిషేధిత ఉత్పత్తుల వ్యర్థాలు నేడు పల్లె, పట్టణమనే తేడా లేకుండా గుట్టలుగా పోగుపడుతున్నాయి. కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో, అడవుల్లో, నదుల్లో.. అంతటా వాటి జాడలే. అయినా ఉమ్మడి జిల్లా ప్రజల్లో చైతన్యం శూన్యం. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ పునర్వినియోగంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ చేస్తున్న ప్రయోగాలు, ప్రయత్నాలు ఆలోచింపజేస్తున్నాయి. మున్సిపాలిటీల్లో బయోమైనింగ్ ప్లాంట్లు, 'పర్యావరణహిత ఇటుకల(ఎకో బ్రిక్స్)' తయారీతో వ్యర్థాల వ్యాప్తికి 'అడ్డుగోడ' కట్టాలని ఆయన యోచిస్తున్నారు. ఈ ప్రయత్నం ఖమ్మం జిల్లాలోనూ అనుసరణీయమని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

తయారీ.. విక్రయాలను అరికడితేనే..

ప్లాస్టిక్ వ్యర్థాల తయారీ, విక్రయాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలి. ఇతర రాష్ట్రాల్లోంచి గుట్టల కొద్దీ దిగుమతి చేసుకునే ఉత్పత్తులతో గుట్టుగా గోదాములను నింపుతుంటే.. 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నచందాన కిమ్మనకుండా ఉంటే అసలుకే మోసం వస్తుంది. కొందరు నిషేధిత ఉత్పత్తుల రిటైల్ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులేమో నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలికల్లో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం ఇంకా పెచ్చరిల్లుతోంది. వివాహాది కార్యాల్లో పెద్ద ఎత్తున వాడుతున్నా పట్టింపు లేదు. ఫలితంగా ఆయా వ్యర్థాలు డంపింగ్ యార్డులతో పాటు డ్రైనేజీలను ముంచెత్తుతున్నాయి. ఈ కారణంగానే ఖమ్మం, మణుగూరులోని వివిధ కాలనీలను ఇటీవల వరద ముంచెత్తింది. ఒకసారి వాడి పారేసే కవర్లు, బాటిళ్ల వినియోగానికి ప్రజలు చైతన్యంతో దూరంగా మెలగాలని అధికారులు సూచిస్తున్నారు.




ఎకో బ్రిక్స్‌తో నిర్మించిన నమూనా ఇల్లు

తరుణోపాయాలివే..

శుభకార్యాలకు స్టీలు సామగ్రిని అందజేసే 'బర్తన్' బ్యాంకులను పాల్వంచ పురపాలిక, ఖమ్మంలో పలుచోట్ల ప్రారంభించారు. వీటిని అన్ని పట్టణాలు, నగరాల్లోని మిగతా వార్డుల్లో వీలైనన్ని ప్రారంభించాలి. ఇక్కడి సామగ్రిని కాలనీ వాసులు శుభకార్యాలకు వినియోగించేలా ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండే వ్యాపారులకు రాయితీలు ఇవ్వాలి. ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. స్వయం సహాయక సంఘాలకు 'మహిళాశక్తి' పథకం కింద జనపనార, వస్త్ర సంచుల యూనిట్లు మంజూరు చేయాలి. వారి ఉత్పత్తులకు స్థానికంగా మంచి మార్కెటింగ్ కల్పిస్తే ఉపాధి మార్గాలూ మెరుగవుతాయి. ఇల్లెందు పట్టణంలో రూ.10 లక్షలకు పైగా వెచ్చించి తెప్పించిన బయోమైనింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తేనేలేదు. దీనిపై దృష్టి పెట్టడమే కాదు, అన్ని పురపాలికల్లో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు నెలకొల్పి ప్లాస్టిక్ పునర్వినియోగానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. ప్రధాన ఆదాయ వనరుగా మలచాలి. ఖాళీ బాటిళ్లలో కవర్లను కుక్కి ఇటుకలుగా వాడే 'ఎకో బ్రిక్స్' తయారీపై ఉద్యమస్థాయిలో చైతన్యం పెంపొందాలి. ఇందుకు విద్యాలయాలు వేదికలుగా నిలవాలి. ఈ క్రతువు తమ ముఖ్య బాధ్యత అని పంచాయతీ, పట్టణ సిబ్బంది, పాలకవర్గాలు గుర్తెరిగేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

ఖమ్మం నగరం: గిరిజనుల సామాజిక, ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంజేయూజీఏ (ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్)కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థంగా అమలుచేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. ఈపథకం ప్రచార గోడపత్రికను కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. గిరిజనులు అధికంగా ఉన్న గ్రామాల్లో ఈపథకం అమలుచేస్తారని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

వానరాలన్నీ.. చేనుకు ఆవల వైపే!



ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్‌కు చెందిన శ్యామ్‌లాల్ రైతు పంట చేను అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంది. దీంతో కోతుల బెడద ఎక్కువైంది. తనకున్న పదెకరాల్లో ఆయిల్‌పాంతో పాటు వరి సాగుచేస్తున్నారు. పైరుకు రక్షణగా రూ.50 వేలతో ఇటీవల సోలార్ విద్యుత్తు తీగలు, వాటిపై వలను ఇలా ఏర్పాటు చేశారు. గత కొద్ది నెలలుగా కోతులు చేనులోకి రావడం లేదని శ్యామ్‌లాల్ పేర్కొన్నారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

బతుకు వేట.. జల్సాల బాట





కత్తి.. వైద్యుడి చేతిలో పడితే శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెడుతుంది. దుర్మార్గుడి చేతిలో పడితే ప్రాణాలు తీస్తుంది. ఖమ్మం నగరంలో కనిపించిన పై దృశ్యాలు అచ్చం అలాంటివే. ద్విచక్ర వాహనాన్ని ఒకరు బతుకు దెరువు సాధనంగా మలుచుకోగా.. మరికొందరు గంజాయి దందాలకు వాడుకొని దొరికిపోతున్నారు. నగరానికి చెందిన సురేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఐస్‌క్రీం పార్లర్‌గా మార్చుకున్నారు. వ్యాపారం ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు. మరో చిత్రంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన జల్సా రాయుళ్ల ఖరీదైన వాహనాలు పోలీసు కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. – న్యూస్‌టుడే, ఖమ్మం సారథినగర్

అవసరం తీరాలంటే.. నైపుణ్యంతో సాగాలంతే!!



ఆదివాసీలు తమ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకు ఎంతటి కష్టాన్నైనా భరిస్తుంటారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని గొత్తికోయ గ్రామం క్రాంతి నగర్‌లో సమీప చేతిపంపు నుంచి నీళ్లను ప్రత్యేక క్యాన్లు, బిందెల్లో తెచ్చుకుంటారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సోలార్ బోరు సరిపడా నీటిని సరఫరా చేయలేనప్పుడు గొత్తికోయ మహిళలు ఇలా నీళ్లను తెచ్చుకుంటుంటారు. మన్యంలో ఇలాంటి దృశ్యాలెన్నో కనిపిస్తుంటాయి.
- లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే

రామయ్యకు ఘనంగా తిరుమంజనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతా రామచంద్ర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారానికి ఒకసారి ఉండే తిరుమంజనం ఘనంగా కొనసాగించి భజనలతో ఆరాధించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో దేవదేవుడికి సుప్రభాతం పలికి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. నిత్య కల్యాణ విశిష్టతను వివరిస్తుండగా దీనికి అనుగుణంగా వైదిక పెద్దలు పూజలు చేశారు. జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక అమితానందకరంగా సాగాయి. హరిదాసుల కీర్తనలు, పండితుల వేద ఘోషతో దర్బారుసేవ తన్మయత్వాన్ని నింపింది. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రధాన కోవెలలోని ధ్రువమూర్తులతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

17న శబరిమాత ఉత్సవం: అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాచలం రామాలయ ఆధ్వర్యంలో ఈనెల 17న శబరిమాత ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 6.30కు గిరి ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వివరించారు. ఈ వేడుక సందర్భంగా 17న గిరిజన సంప్రదాయంలో అశ్వారావుపేట మండలంలోను ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు అశ్వారావుపేట మండలం వినాయకపురంలో భద్రాచలం రామరథ శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. చిలకలగండి ముత్యాలమ్మ ఆలయానికి పది గంటలకు చేరుకుని అక్కడ సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టుపై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్ గురువారం జరగనుంది.



గెలుపొందిన ఖమ్మం జట్టు

దశదిశలు నిండుగా.. దసరా పండగ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే



నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తెలుగువారి పెద్ద పండగ విజయదశమి నేటి నుంచి ప్రారంభం కానుంది. శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు 3వ తేదీ నుంచి 13 వరకు వేడుకగా నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు దుర్గామాత అమ్మవారికి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్, కాల్వొడ్డు, నాయుడుపేటతో పాటు ప్రధాన కూడళ్లలో కొద్దిరోజులుగా అమ్మవారి విగ్రహాల విక్రయాలు జరుగుతున్నాయి. నాలుగు రోజులుగా కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని విక్రయదారులు చెబుతున్నారు. అడుగున్నర నుంచి 10 అడుగుల పైన దుర్గామాత విగ్రహాలను పలు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఎత్తు, ఆకృతి ప్రకారం ధరను నిర్ణయించి విక్రయించారు. భక్తులు అమ్మవారి దీక్షామాలను ధరించి విజయదశమి రోజున విరమిస్తారు.



గుట్టలబజారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దీపాలంకరణలు

రోజుకో అవతారం

శరన్నవరాత్రి తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవార్లకు పూజలు చేయనున్నారు. స్తంభాద్రి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో తొలిరోజు అమ్మవారు శ్రీఆదిలక్ష్మీ, రెండోరోజు శ్రీధాన్యలక్ష్మీ, మూడోరోజు శ్రీధైర్యలక్ష్మీ, నాలుగోరోజు శ్రీసంతానలక్ష్మీ, ఐదోరోజు శ్రీగజలక్ష్మీ, ఆరోరోజు శ్రీవిజయలక్ష్మీ, ఏడో రోజు శ్రీసరస్వతీదేవి, ఎనిమిదో రోజు శ్రీదుర్గాదేవిగా, తొమ్మిదో రోజు శ్రీధనలక్ష్మీ, విజయదశమి రోజున శ్రీసకల సంపద లక్ష్మీదేవీ అవతారంలో భక్తులకు సాక్షాత్కారమిస్తారు.

ముస్తాబైన దేవాలయాలు

శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, జమ్మిబండ(పారువేట) స్థలం, గుట్టల బజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, రోటరీనగర్ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాలతోపాటు మండపాల్లో అమ్మవారికి పూజలు వైభవంగా చేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. అక్టోబరు 12న విజయదశమికి జమ్మి చెట్టుకు పూజ, నరకాసుర వధ కార్యక్రమం జరుగుతుంది. మరుసటి రోజు(13)న అమ్మవారి శోభాయాత్ర సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై కాల్వొడ్డు మున్నేరు వంతెన వద్ద నిమజ్జనం చేస్తారు.

ఎడ్లు బెదరడంతో వాగులో బండి బోల్తా

యువరైతు దుర్మరణం



అంగోత్ గాంధీ

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఆ కుటుంబం రోజంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. అంతా కలిసి ఎప్పటిలాగే ఎడ్లబండిపై ఇంటికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో వాగు ఉద్ధృతికి బండి కొట్టుపోయింది. వరదలో అంతా చెల్లాచెదురయ్యారు. తాను నడుపుతున్న బండి కిందపడి నీళ్లల్లో ఊపిరాడక యువ రైతు మృతిచెందాడు. వెంటనే అప్రమత్తమైన పొరుగు రైతులు మరో ముగ్గురిని కాపాడారు. పొద్దుగూకే సమయంలో పడిన భారీ వర్షంతో ఒక్కసారిగా వాగు ప్రవాహం పెరగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో బుధవారం సాయంత్రం జరిగిన సంఘటన వివరాలు. . పి.కొత్తతండాకు చెందిన అంగోత్ గాంధీ (34)కి లక్ష్మీపురం గ్రామ సమీపంలో భూమి ఉంది. ఉదయాన్నే భార్య రజిత, తండ్రి లక్ష్మా, తల్లి జమ్మాతో కలిసి ఎండ్ల బండిపై చేనుకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి బయల్దేరాల్సిన సమయంలో సమీప గుట్టలపై భారీ వర్షం కురిసింది. చినుకులు తగ్గగానే కుటుంబమంతా కలిసి తిరిగొస్తున్నారు. రెండు గ్రామాల మధ్యలోనున్న వాగు చప్టా మీదుగా దాటుతుండగా ఒక్కసారిగా వరద పోటు రావడంతో ఎడ్లు బెదిరాయి. దీంతో బండి అదుపుతప్పి ఒక్కసారిగా అయిదు అడుగుల లోతున్న నీళ్లల్లో తలకిందులైంది. అక్కడే పొలాల్లో ఉన్న రైతులు వెంటనే వచ్చి రజిత, లక్ష్మా, జమ్మాలను కాపాడారు. కొద్ది అడుగుల దూరం కొట్టుకుపోయిన బండి చెట్టును తట్టుకుని ఆగింది. చెట్టుకు, బండి మధ్య చిక్కుకున్న గాంధీని వెంటనే బయటకు తీసుకురాగా అప్పటికే అతడు నీళ్లల్లో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. అప్పటిదాకా తమతో పాటే పనిచేసుకుంటూ ఉన్న ఇంటి పెద్దదిక్కు రెప్పపాటులో విగతజీవిగా మారడంతో భార్య రజిత, తల్లిదండ్రులు గుండెలవిసెలా రోదించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. టేకులపల్లి ఎస్సై సురేశ్ ఘటనాస్థలిని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన బుధవారం చేటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . లక్ష్మీపురం గ్రామానికి చెందిన కుంజ లక్ష్మయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్(19) అదే గ్రామానికి చెందిన ఎట్టి రామస్వామి, కృష్ణవేణి దంపతుల కుమారుడు ప్రణయ్‌తేజ్ (14) ద్విచక్రవాహనంపై అనంతోగులో బంధువుల ఇంటికెళ్లి తిరిగొస్తున్న తరుణంలో తీర్లాపురం-ఆళ్లపల్లి మార్గమధ్యలో మకలకట్ట ఒర్రె సమీపంలోని మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, వీరి ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రవీణ్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు టైర్ కిందపడటంతో ప్రణయ్‌తేజ్ తలకు తీవ్రగాయమైంది. ఎడమ కాలు విరిగింది. ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం సర్వజనాసుపత్రికి స్థానికులు తరలించారు. అక్కడ వైద్యమందిస్తుండగా ఇద్దరు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్టీసీ డ్రైవర్ ముత్తయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సును ఆళ్లపల్లి ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రతీశ్ తెలిపారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

కూసుమంచి, న్యూస్‌టుడే: సూర్యాపేట - ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీని ఓ ప్రైవేటు బస్సు వెనకనుంచి ఢీకొంది. ఈ క్రమంలో అదుపుతప్పిన బస్సు సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఖమ్మం వైపు నుంచి హైదరాబాద్‌కు అతివేగంగా వెళ్తున్న ప్రైవేటు బస్సు హట్యాతండా ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. అందులో ఉన్న 24 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారిని జాతీయ రహదారి రక్షణ విభాగం సిబ్బంది ఇతర బస్సుల్లో తరలించారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

ఖర్చు తగ్గించుకుంటేనే ఆయిల్‌పాంలో లాభాలు: డాక్టర్ ఐవీఎస్ రెడ్డి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: సాగు ఖర్చు తగ్గించుకుని ఆయిల్‌పాంలో లాభాలు సాధించాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి సూచించారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోయర్స్ సొసైటీ సమావేశాన్ని అశ్వారావుపేట గిరిజన భవన్‌లో తుంబూరి మహేశ్వరరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడి సారవంతమైన నేలలను పాడు చేయవద్దని హితవుపలికారు. జీవన, సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందన్నారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పామాయిల్ పరిశ్రమల్లో వచ్చిన ఓఈఆర్‌ను ఏపీ ప్రామాణికంగా తీసుకుంటోందని, మన ఓఈఆర్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో రెండు పామాయిల్ పరిశ్రమలు ఉన్నాయని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఈ ప్రాంతంలోనే నూనె శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొక్కెరపాటి పుల్లయ్య, జూపల్లి రమేష్ ప్రసంగించారు. తీర్మానం ప్రతిని విడుదల చేశారు. సీతంశెట్టి సత్య, దారా తాతారావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, అంకత మహేశ్వరరావు, తుమ్మా రాంబాబు, శీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానం ప్రతిని విడుదల చేస్తున్న రైతుసంఘ నాయకులు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు







ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు బుధవారం అంబరాన్నంటాయి. పాల్వంచ కేటీపీఎస్ రాధాకృష్ణ ఆలయంలో ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలతో పాటు పరిసర కాలనీల వారు పెద్దఎత్తున తరలివచ్చి బతుకమ్మలాడారు. రామాలయ భజనమందిరం, వేంకటేశ్వరహిల్స్‌కాలనీ, నవభారత్ ప్రాంతాల్లో సందడి నెలకొంది. **- పాల్వంచ, న్యూస్‌టుడే**

పక్షి సంచారంపై నిఘావర్గాల ఆరా..!

చర్ల, న్యూస్‌టుడే: చర్లలో జీపీఎస్ ట్రాకర్‌తో కూడిన గద్దలాంటి పక్షి సంచారంపై ‘ఈనాడు’లో బుధవారం వెలువడిన ‘జీపీఎస్ ట్రాకర్‌తో.. చర్లలో గద్ద సంచారం..!’ కథనం ప్రచురితమైన నేపథ్యంలో నిఘా వర్గాలు ఆరా తీశాయి. జీపీఎస్ ట్రాకర్, కెమెరాలతో ఉన్న పక్షి ఇక్కడి నాయకకాలనీలో గుట్ట ప్రాంతంలోని ఏకలవ్య విద్యాలయం సమీపంలోకి వచ్చి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, నిఘా వర్గాలు ఆరా తీయడంతో సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి గద్ద సంచారంపై స్థానికుల నుంచి సమాచారాన్ని బుధవారం తెలుసుకున్నారు. ఈ పక్షి మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వు ఫారెస్ట్‌కు చెందినదిగా భావిస్తున్నారు. అక్కడ సుమారు రెండు డజన్ల ఇలాంటి పక్షులను శాస్త్రీయంగా పర్యవేక్షించడానికి రెండేళ్ల క్రితం జీపీఎస్‌తో ట్యాగ్ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందులో ఒక పక్షి ఇటు వచ్చినట్లు భావిస్తున్నారు. మళ్లీ ఈ పక్షి సంచరిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు సూచించారు.

డెంగీతో వృద్ధుడి మృతి

తల్లాడ, న్యూస్‌టుడే: మల్లవరం గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ సర్వేయర్ (66) డెంగీతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత నెల 16న డెంగీ బారిన పడటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదీర్ఘ కాలం సర్వేయర్‌గా పనిచేసిన ఆయనకు గుర్తింపు ఉంది.

నాటి సీఎం కప్ విజేతలకు ఆహ్వానం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహించింది. నాటి విజేతలను ఈనెల 3న హైదరాబాద్ ఎల్.బి. స్టేడియానికి రావాలని ఆహ్వానాలు అందాయి. జాబితా జిల్లా యువజన క్రీడల శాఖకు అందంగా ఇక్కడి అధికారులు సమాచారం అందజేశారు. గత ఏడాది పోటీలు నిర్వహించినప్పటికీ విజేతలకు ప్రకటించిన నగదు బహుమతులు అందలేదని, వాటిని అందజేసేందుకు విజేతలను ఆహ్వానించినట్టు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాటి విజేతలు 55 మంది ఉన్నారు.

మరో మృతదేహం లభ్యం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం దానవాయిగూడెం వద్ద మంగళవారం తెల్లవారుజామున సాగర్ కాల్వలో పడి ముగ్గురు గల్లంతైన విషయం విదితమే. ఒకరి మృతదేహం అదే రోజు లభ్యమవ్వగా.. బుధవారం మరొకరి మృతదేహం కనిపించింది. వి.వెంకటాయపాలెం సమీపంలోని సాగర్ కాల్వపై ఉన్న లాకుల వద్ద చల్లా రమేశ్(38) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అన్నం సేవా సంస్థకు సమాచారం ఇవ్వడంతో బాధ్యులు వెళ్లి మృతదేహాన్ని ఉదయం బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఖమ్మం సర్వజనాసుపత్రి మార్చురీకి తరలించారు. మంగళవారం సాయంత్రం భరత్ మృతదేహం లభ్యమైంది. బుధవారం చల్లా రమేశ్, భరత్ మృతదేహాలకు పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. వారు ప్రభుత్వ వాహనంలో మణుగూరు తీసుకువెళ్లారు. గల్లంతైన మరో యువకుడు ప్రసాద్ ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



పులిసాని మహేశ్‌రెడ్డి

అశ్వాపురం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన పులిసాని మహేశ్‌రెడ్డి(34) హైదరాబాద్‌లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నార్సింగ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మహేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, నాలుగేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడు ఉన్నారు. ఆదివారం కుమారుడి తొలి పుట్టిన రోజు వేడుకలను మొండికుంటలో తన తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సోమవారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. వెళ్లిన రెండో రోజే అతని మృతదేహం గ్రామానికి తిరిగి రావడంతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే మహేశ్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

కాంట్రాక్టు కొలువులైనా దక్కేనా..?

ప్రభుత్వం ఆదేశించినా మొదలుకాని ధ్రువపత్రాల పరిశీలన

భద్రాచలం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఏపీలో 2008లో నిర్వహించిన కామన్ డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. అప్పట్లో నష్టపోయిన వారికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలో కొలువులు ఇచ్చేందుకు నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై భద్రాచలం మన్యంలో ఇంకా అయోమయం వీడడం లేదు. ఖమ్మం మైదాన ప్రాంతంలో ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నారు. ఎస్టీ అభ్యర్థులను ఐటీడీఏకు వదిలేశారు. దీంతో ఆ అభ్యర్థులు అటు విద్యాశాఖ కార్యాలయానికి, ఇటు ఐటీడీఏకు తిరుగుతూ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

అప్పట్లో ఏం జరిగిందంటే... 2008 డీఎస్సీ నియామక ప్రక్రియలో ఆఖరి నిమిషంలో అనూహ్యంగా 30 శాతం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులను డీఈడీ పూర్తి చేసిన వారికి ప్రత్యేకంగా ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మార్కుల పరంగా ముందున్నప్పటికీ దాదాపు 2367 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. దీంతో అప్పటి నుంచి వీరు న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోర్టులు తీర్పునిచ్చాయి. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించాలని ఆదేశించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో 330 మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయ పోస్టులు రానుండగా.. 67 మంది గిరిజన అభ్యర్థులు ఉన్నారు. మిగతావారి ధ్రువపత్రాలను ఖమ్మంలో పరిశీలిస్తుండగా, గిరిజన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎవ్వరు పరిశీలించాలన్నది తేల్చకుండా నాన్చుతున్నారు. 67 మందిలో 20 మంది వేర్వేరు వృత్తుల్లో, ఉపాధి అవకాశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతావారు వారు గిరిజన సంక్షేమశాఖ డీడీ మణెమ్మను కలిసి తమ పరిస్థితిని వివరించారు. ఆమె పీఓ రాహుల్, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. డీఈఓ పరిశీలన చేయని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐటీడీఏలోనే పరిశీలన చేసి కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటామని డీడీ తెలిపారు.



డీఎస్సీ అభ్యర్థుల దరఖాస్తును పరిశీలిస్తున్న డీడీ మణెమ్మ

నేడు మైదాన ప్రాంతంలో..

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం.. ఐటీడీఏ ప్రాంత డీఎస్సీ 2008 అభ్యర్థులు 67 మందికి ఈనెల 3న ఖమ్మం ఆర్‌టీఏ కార్యాలయం వెనుక ఉన్న గిరిజన భవన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 9:30 గంటలకు చేపట్టనున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎన్.విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిలో నియామకం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ గెజిటెడ్ సంతకంతో ఉన్న నకలు పత్రాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

చట్టాలపై అవగాహన ఉండాలి: న్యాయమూర్తి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి

మధిర, న్యూస్‌టుడే: వయోవృద్ధులకు చట్టాలపై అవగాహన ఉండాలని మధిర కోర్టు న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో పారుపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వయోవృద్ధుల సంఘం రాష్ట్ర బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని న్యాయమూర్తి సందర్శించారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

వైరా, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాపా మురళీకృష్ణ అన్నారు. వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా కో ఆర్డినేటర్ నీరజ సహకారంతో దూదిపాళ్ల బేబీకి కుట్టుమిషన్‌ను బుధవారం పంపిణీ చేశారు. చింతలపూడి వెంకటేశ్వరరావు, రమేశ్, రాంగోపాల్, పెనుగొండ ఉపేందర్, శ్రీనివాసరావు, మాదినేని సునీత పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

రాజేందర్: తిమ్మినేనిపాలెం- తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం- సీతంపేట గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా కంపచెట్లు అల్లుకొనిపోయాయి.

రామయ్య, ఎంపీడీఓ: రెండు రోజుల్లో రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి సమస్య పరిష్కరిస్తాం.
– చింతకాని, న్యూస్‌టుడే

కె.లక్ష్మి, స్థానికురాలు: సత్తుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి రోడ్డులో వీధిదీపాలు లేవు. రాత్రి వేళలో ఆ మార్గంలో పాములు సంచరిస్తున్నాయి. ఆకతాయిలు మద్యం తాగుతున్నారు.

అద్దంకి అనిల్‌కుమార్, కౌన్సిలర్: సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. వారంలో పనులు ప్రారంభిస్తాం. – సత్తుపల్లి, న్యూస్‌టుడే

బతుకమ్మ సంబురాలు ప్రారంభం

పెనుబల్లి: ఎంగిలిపూల బతుకమ్మతో సంబురాలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా పలు గ్రామాల్లో మహిళలు బుధవారం తులసి చెట్టును నాటారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ కోలాట నృత్యాలతో అలరించారు.



వీఎం బంజర్‌లోని వంగా సీతారామయ్యగారి వీధిలో బతుకమ్మ వద్ద మహిళలు

కారేపల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు, యువతులు ఆడిపాడారు.

వైరా, న్యూస్‌టుడే: వైరా పుర కార్యాలయ ఆవరణలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను బుధవారం నిర్వహించారు. పుర అధ్యక్షుడు సూతకాని జైపాల్, ఉపాధ్యక్షుడు ముళ్లపాటి సీతరాములు, కమిషనర్ వేణు, కౌన్సిలర్లు మాదినేని సునీత, దారెల్లి పవిత్ర పాల్గొన్నారు.

వనమా.. పచ్చధనమా

ముదిగొండ, మధిరగ్రామీణం, న్యూస్‌టుడే: సంప్రదాయ పంట సాగులో ఖర్చులు ఎక్కువై లాభాలు తగ్గుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలతో పెట్టుబడులూ రాక చాలామంది రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు అన్నదాతలు తక్కువ వ్యయంతో బంతి పూల సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. డిమాండ్ ఉన్న సమయంలో దిగుబడి చేతికొచ్చేలా జాగ్రత్త పడుతున్నారు. నియోజకవర్గంలోని ఏటా బంతి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం: 150 ఎకరాలకు పైగా



ఎక్కడెక్కడ పండిస్తున్నారు?

ముదిగొండ మండలం: వల్లభి, వనం వారికిష్టాపురం, ఖానాపురం
మధిర: మాటూరు, మాటూరుపేట, దెందుకూరు, ఆత్కూరు, మడుపల్లి
ఎర్రుపాలెం: మామూనూరు, పెద్దగోపవరం, చోప్పకట్లపాలెం
చింతకాని: వందనం, కొదుమూరు
బోనకల్లు: ముష్టికుంట్ల



'మాది మధిర మండలం మాటూరు. అయిదేళ్లుగా తోట వేస్తున్నా. రెండు ఎకరాల్లో బంతి సాగు చేస్తున్నా. గతంలో పత్తి, మిరపతో నష్టపోయా. వినియోగదారులు పొలం వద్దకే వచ్చి కొంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు పది క్వింటాళ్ల పూలు విక్రయించాను. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తోంది.'
- కంచెపోగు గణేశ్, మాటూరు



'మాది మధిర మండలం దెందుకూరు. పదేళ్లుగా బంతి పూలు పండిస్తున్నా. అయిదెకరాల్లో సాగు చేస్తున్నా. 20క్వింటాళ్లు విక్రయించాను. బంతితో పాటు మరో 5ఎకరాల్లో చామంతి, గులాబీ సాగుచేస్తున్నా. ఇందులో నష్ట భయం తక్కువ.'
- అమరనేని వెంకటేశ్వరరావు, దెందుకూరు.



'మాది ముదిగొండ మండలం ఖానాపురం. 20 ఏళ్లుగా బంతి తోట వేస్తున్నా. 30 కుంటల్లో సాగు చేసిన పంటను ప్రస్తుతం విక్రయిస్తున్నా. ఇంకో ఎకరం విస్తీర్ణంలో వేసిన బంతి పైరు కొద్ది రోజుల్లో కాపునకు వస్తుంది. ఇప్పటివరకు 8 క్వింటాళ్లు విక్రయించాం. మరో 13 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశముంది.'
-సంకేళ్ల వెంకటరామయ్య, కళావతి, ఖానాపురం.

ఎందుకిలా?

- ☆ ఏటా వరుస పర్వదినాల రూపంలో వచ్చే బతుకమ్మ, దసరా, దీపావళి, కార్తీకమాసంలో బంతి పూలకు బాగా డిమాండ్ ఉంటోంది. అక్టోబరు మొదలు జనవరి వరకు విపరీత గిరాకీ.
- ☆ వివిధ శుభకార్యాలు, గృహప్రవేశాలు, ఇతర వేడుకల నేపథ్యంలో ఏడాది పొడవునా బంతిని విరివిగా వినియోగిస్తున్నారు. దీంతో కొందరు ఏడాదంతా దిగుబడి వచ్చేలా క్రమపద్ధతిలో సాగు చేస్తున్నారు.
- ☆ పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటోంది. ఎకరా విస్తీర్ణంలో రూ.50వేల వరకు ఖర్చు చేస్తూ ధర బాగుంటే రూ.లక్ష ఆదాయం గడిస్తున్నారు.
- ☆ వినియోగదారులే నేరుగా తోట వద్దకు వచ్చి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు సైతం మిగులుతున్నాయి.
- ☆ ప్రస్తుతం కిలో రూ.60-80 చొప్పున విక్రయిస్తున్నారు. పండగ రోజుల్లో రూ.100 దాకా చేరుతోంది.
- ☆ లాభాలు రాకున్నా నష్టాలు మాత్రం లేకపోవటంతో కొందరు పదేళ్ల నుంచి దీర్ఘకాలిక సాగులో ఉండిపోయారు.

సమాఖ్య ఆవిర్భావ వేడుకలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వేంసూరు రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం భారతీయ బీమా ఏజెంట్ల సమాఖ్య 60వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం బ్రాంచ్ మేనేజర్ శ్రీరామచంద్ర కేక్ కోసి మిఠాయిలు పంచారు. జోనల్, డివిజన్, బ్రాంచ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: రాయపట్నం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు కోట నాగభూషణం, నాగరత్నంను తెదేపా రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి రామనాథం బుధవారం పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

కారేపల్లి, న్యూస్‌టుడే: ప్రయాణాలు సాగించేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కమిషనర్(శాంతిభద్రతలు) ప్రసాదరావు సూచించారు. ఈ నెల 1న భాగ్యనగర్‌తండా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించిన ప్రదేశాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం అక్కడే వాహన తనిఖీలు చేపట్టి పలు సూచనలు చేశారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారాం పాల్గొన్నారు.

'పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి'



పంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న నంబూరి

కల్లూరు, న్యూస్‌టుడే: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించి వేతనాలు పెంచాలని భాజపా పార్లమెంటు కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. కల్లూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం పంచాయతీ కార్మికులకు నూతన వస్త్రాలు బహూకరించి సన్మానించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుల్లారావు, బుర్రి వెంకట్రామయ్య, పసుపులేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా 22వ వార్డు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా 22వ వార్డును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు పుర కమిషనర్ ఎం.రవిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే అక్టోబరు 3నుంచి 7వరకు కొనసాగుతుందన్నారు. స్థానికులు ఆధార్ నంబర్, ఫొటో వంటి వివరాలను అందుబాటులో ఉంచుకుని సర్వేకు సహకరించాలని సూచించారు.

వాచ్యనాయక్ తండాలో..

కల్లూరు, న్యూస్‌టుడే: డిజిటల్ కుటుంబ గుర్తింపు కార్డు సర్వేకు వాచ్యనాయక్ తండా గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు ఆర్డీవో రాజేందర్ తెలిపారు. ఈ నెల 3నుంచి 8వరకు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తామని, కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండాలన్నారు.

'సమసమాజ స్థాపనే కేవీపీఎస్ లక్ష్యం'

బోనకల్లు, న్యూస్‌టుడే: సమసమాజ స్థాపనే కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) లక్ష్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం బోనకల్లులో నిర్వహించారు. నాయకులు నరేశ్, ఏసుపోగు బాబు, ప్రకాశ్ కోటేశ్వరరావు, రాజారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

వైరా, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. పాలడుగులో బుధవారం నిర్వహించిన పార్టీ గ్రామసభలో మాట్లాడారు. పాలడుగు నుంచి రాపల్లె వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. గ్రామశాఖ కార్యదర్శిగా మజీద్‌బీను నియమించారు.

అహింసా మార్గంలో స్వాతంత్ర్యం: ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: అహింసా మార్గంలోనే గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం సాధించారని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పుర కమిషనర్ ఎం.రవిబాబు, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబుతో కలిసి నివాళులర్పించారు. క్యాంపు కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు దయానంద్ నివాళులర్పించారు. కోర్టు సముదాయాల ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.మీరాఖాశీంసాహెబ్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెళ్లూరి ఆడమ్స్‌తో కలిసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సబ్‌జైల్లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. సండ్ర క్యాంపు కార్యాలయం, తెదేపా కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. వాసవీక్లబ్ బాధ్యులు వందనపు సత్యనారాయణ, గోపాలరావు, కొత్తూరు ఉమా, శివకుమార్‌లు నివాళులర్పించారు. గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ చటర్జీ పాల్గొన్నారు.

బోనకల్లు: బోనకల్లు రైల్వే స్టేషన్ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. శాంతి నిలయంలో పండ్లు పంచిపెట్టారు.

ఎర్రుపాలెం: కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వి.సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. గాంధీ కూడలిలో వాసవీక్లబ్ నాయకుల ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు.

వేంసూరు, న్యూస్‌టుడే: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ ఎంఏ రాజు, మర్లపాడు సెంటరులో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సోమిరెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు, న్యూస్‌టుడే: చినకోరుకొండిలో బస్ షెల్టరు, గాంధీ విగ్రహాన్ని నిత్యం శుభ్రం చేస్తున్న రెడ్డి అనంతమ్మకు విశ్రాంత ఏఎస్ఐ కుమ్మరి రామారావు, అనసూయ దంపతులు నూతన వస్త్రాలు బహూకరించారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఎంపీ డబ్ల్యూలకు బీమా పత్రాలందించారు. ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, ఎంపీఓ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైరా, న్యూస్‌టుడే: వైరాలోని కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పురపాలిక అధ్యక్షుడు సూతకాని జైపాల్, పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి నివాళి అర్పించారు. గాంధీచౌక్‌లో వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, డా.పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి కిరణ్, మిట్టపల్లి నాగి, వాసిరెడ్డి సునీత, రవికుమార్ నివాళి అర్పించారు.

మధిర, మధిర పట్టణం, న్యూస్‌టుడే: తహసీల్దార్ రాంబాబు, ఎస్సై సంధ్య, ఏడీఈ అనురాధ వారి కార్యాలయాల్లో నివాళి అర్పించారు. తెదేపా రాష్ట్ర నాయకుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్.. గాంధీ విగ్రహాలకు పూలమాల వేశారు. సుందరయ్యనగర్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. భారాస కార్యాలయంలో లింగాల కమల్‌రాజు నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు సఫాయి కార్మికులను సన్మానించారు.

కల్లూరు, న్యూస్‌టుడే: ఆర్డీవో రాజేందర్‌గౌడ్, తహసీల్దారు సాంబశివుడు, పంచాయతీ ఈవో నాగేశ్వరరావు ఆయా కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. పంచాయతీ కార్మికులను సన్మానించారు.

మధిర గ్రామీణం: గ్రామీణ ఠాణాలో ఎస్సై లక్ష్మీభార్గవి, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ సాంబయ్య తదితరులు నివాళి అర్పించారు.

ఏన్కూరు, చింతకాని, కొణిజర్ల, కారేపల్లి, పెనుబల్లి, తల్లాడ మండలాల్లోనూ జాతిపిత గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి మీరాఖాశీంసాహెబ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడమ్స్



వైరా: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



కల్లూరులో ఆర్యవైశ్య సంఘం నాయకులు



మధిర: కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

ఏకలవ్య పాఠశాల ఎదుట రైతుల ఆందోళన

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగాలు, పైసలిస్తామంటే భూములిచ్చామని, తీరా తమను పట్టించుకునేవారు కరవయ్యారంటూ రేలకాయలపల్లిలో నిర్మించిన ఏకలవ్య గురుకుల పాఠశాల ఎదుట రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఎకరాకు రూ.లక్షల్లో పరిహారం, కుటుంబంలో ఒకరికి పొరుగు సేవల ఉద్యోగమిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. పాఠశాల ప్రధాన గేటును మూసేసి నిరసన తెలిపారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించేశారు. ఈక్రమంలో వాదనలు, తోపులాటతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భూములను కోల్పోయిన తమకు న్యాయం చేయాలని అడిగితే ఇబ్బందులకు గురిచేస్తారా.. చస్తే ఇక్కడే చస్తాం అంటూ పురుగుమందు డబ్బాలతో కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



పాఠశాల ద్వారం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు అంబేడ్కర్ నగర్‌లో బుధవారం మధ్యాహ్నం ఉబ్బన జ్యానేష్‌కు చెందిన ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. ప్రమాదంలో టీవీ, మంచాలు, దుస్తులతోపాటు విలువైన వస్తువులు, ఆభరణాలు కాలిపోయాయి. తహసీల్దారు పులి సాంబశివుడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రూ.5.5 లక్షల నష్టం వాటిల్లినట్లు పంచనామాలో నమోదు చేశారు. ఆర్ఐ సుజాత తక్షణ సాయం రూ.6వేలు నగదు, బియ్యం అందజేశారు. కొందరు గ్రామస్థులు ఆర్థిక సాయం అందజేశారు.



యడవల్లిలో కాలిపోయిన సామగ్రి

ఇంట్లో సామగ్రి దగ్ధం: ముదిగొండ: వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపించి ఇంట్లో సామగ్రి దగ్ధమైన ఘటన యడవల్లిలో బుధవారం చోటుచేసుకుంది. గుంజులూరి ముత్తమ్మ నివాసంలో వంటగ్యాస్ లీకై టీవీ, ఇతర సామగ్రి, దుస్తులు కాలి రూ.50వేల నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

గాలిదుమారం బీభత్సం

బోనకల్లు, వైరా, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా వచ్చిన గాలిదుమారం మండలంలో బీభత్సం సృష్టించింది. బుధవారం రాత్రి గాలి ఉద్ధృతికి భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వైరా-బోనకల్లు మార్గంలో సీతానగరం గ్రామం వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. స్తంభాలు నేలకూలి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బోనకల్లు, వైరా పోలీసులు కింద పడిన వృక్షాన్ని తొలగించి రాకపోకల జరిగేలా చూస్తున్నారు.

చింతకాని, న్యూస్‌టుడే: నాగులవంచ- సీతంపేట, లచ్చగూడెం-కొదుమూరు, తిరుమలాపురం అడ్డరోడ్డు సమీపంలో చెట్లు విరిగి పడటంతో రవాణా నిలిచిపోయింది. జేసీబీ సాయంతో చెట్లను తొలగించి రవాణా పునరుద్ధరిస్తామని ఎంపీడీఓ రామయ్య తెలిపారు. గాలిదుమారానికి మండల వ్యాప్తంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దుర్గాదేవి మండపాల వద్ద టెంట్లు నేలకొరిగాయి.

స్మశానవాటిక లేక ఇబ్బందులు

కొణిజర్ల: చిన్నమునగాలలో దళితులకు స్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్య వీరభద్రం, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు తెలిపారు. చిన్నమునగాలలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా చింతనిప్పు నరసింహారావు, సహాయ కార్యదర్శిగా కంపసాటి శివను నియమించారు.

కష్టాల కడలి నుంచి..

పెనుబల్లి, న్యూస్‌టుడే: కూతురికి చదువుపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లి తన కొడుకుతో కలిసి కూలీ పనులు చేస్తూ ప్రయోజకురాలిగా మార్చింది. పెనుబల్లికి చెందిన సంపెట వెంకటేశ్వరరావు, వరలక్ష్మిల కూతురు రేణుక. చిన్ననాటి నుంచి చదువంటే ఆసక్తి. కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న క్రమంలో తండ్రి మరణించటంతో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. రేణుక ఆసక్తిని గమనించిన తల్లి, సోదరుడు మరింత ప్రోత్సహించారు. నమ్మకాన్ని వమ్ముచేయకుండా బీఎస్సీ, డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన రేణుక రెండేళ్ల క్రితం వరకూ పెనుబల్లి ప్రాథమిక పాఠశాలలో వాలంటీరుగా సేవలందించింది. హైదరాబాద్ వెళ్లి డీఎస్సీకి ప్రిపేర్ అయింది. ఎస్జీటీలో 67వ ర్యాంకు సాధించి కుటుంబానికి వెలకట్టలేని సంతోషాన్ని అందించింది.



సంపెట రేణుక

విజయ పాఠాలు..

డీఎస్సీలో సత్తాచాటిన గ్రామీణ అభ్యర్థులు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు మండలం చిన్నకోరుకొండి.. పేరుకు తగ్గట్టే చిన్న గ్రామం.. ఆ ఊరి నుంచి ఏకంగా అయిదుగురు డీఎస్సీ విజేతలుగా నిలిచారు. మరో విశేషం ఏమిటంటే అందరూ ఎస్జీటీ విభాగంలోనే ప్రతిభ చూపారు. ఇందులో జిల్లా స్థాయి ర్యాంకు దక్కించుకున్న వారూ ఉన్నారు.



రెడ్డి గోపి

☆ వ్యవసాయ కుటుంబానికి చెందిన **రెడ్డి గోపి** జిల్లాలో 6వ ర్యాంకు, పేదకుటుంబానికి చెందిన నామా గోపి స్వయం కృషితో డీఎస్సీలో జిల్లా 66వర్యాంకు సాధించి టీచరు ఉద్యోగాన్ని సాధించారు.

☆ రాజ్యలక్ష్మి భర్త రెడ్డి నాగేశ్వరరావు ప్రోత్సాహంతో కొలువు సాధించినట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో 96వ ర్యాంకు సాధించారు.

☆ గ్రామానికి చెందిన రెడ్డి మాధురి, మూలగుండ్ల శివరామకృష్ణ దంపతులు మెరుగైన ర్యాంకులు సాధించారు. శివరామకృష్ణ తండ్రి ఆదినారాయణ, అక్క అనూష, బావ మాదిరాజు నాగేశ్వరరావు ఉపాధ్యాయులే. ఆ స్ఫూర్తితోనే విజయం సాధించినట్లు తెలిపారు.



☆ కల్లూరు మండలం గోపాలదేవబోయినపల్లికి చెందిన సంగం రాజా రంజిత్‌కుమార్ బయాలజీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు దక్కించుకున్నారు. రెండు నెలల క్రితమే గురుకులంలో కొలువు సాధించారు.

☆ సంగం మమత తన భర్త సహకారంతో ఎస్జీటీలో 81వ ర్యాంకుతో ప్రతిభ చూపారు. ఎస్‌బీఐ కస్టమర్ సర్వీసులో పనిచేసే భర్త ఆమెను ప్రోత్సహించారు.

జంట విజయం



నాగరాజు, స్రవంతి

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య గురుకుల ఉపాధ్యాయిని. ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేసే భర్త కూడా గురుకుల కొలువు సాధించారు. దంపతులిద్దరి లక్ష్యం డీఎస్సీ. నోటిఫికేషన్ పడగానే ఆందోళన చెందలేదు. కలిసి చదివారు. కలిసి సాధించారు. ఇద్దరూ విజేతలుగా నిలిచారు. ఎర్రుపాలెం మండలం పెద్ద గోపవరానికి చెందిన గౌరాజు నాగరాజు-ఈదర స్రవంతి దంపతులు మధిర మండలం ఆత్కూరులో ఉంటున్నారు. స్రవంతి మధిర పట్టణంలోని గురుకుల కళాశాలలో ఉపాధ్యాయిని. నాగరాజు సంక్షేమ వసతి గృహ అధికారిగా నియమితులయ్యారు. నియామక పత్రం అందుకోవాల్సి ఉంది. వీరిద్దరూ తాజా డీఎస్సీ ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు. నాగరాజు స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 26వ ర్యాంకు, స్రవంతి స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 38వ ర్యాంకు సాధించారు.

అక్కాచెల్లెలు...



విజిత ఆషా

మధిర గ్రామీణం: మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన పెదనాన్న, చిన్నాన్న కుమార్తెలు ఎస్జీటీ ర్యాంకుల్లో ప్రతిభ చూపారు.

☆ పేద కుటుంబానికి చెందిన తీర్థాల విజిత చిన్నతనం నుంచి ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంది. తండ్రి వెంకటేశ్వరరావు కూలీ పనులు చేస్తుండగా తల్లి సావిత్రి దెందుకూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తున్నారు. ఇటీవల టెట్ క్వాలిఫై అయిన విజిత ఎటువంటి శిక్షణ లేకుండా ఇంటి వద్ద ఉంటూ కష్టపడి చదివింది. డీఎస్సీలో 42వ ర్యాంకు సాధించింది

☆ తీరాల ఆషా 92వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తుంటారు. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్ద ఉంటూ తనూ కష్టపడి కొలువు సాధించింది.

దాడుల నియంత్రణలో విఫలం: ఐద్వా

మధిర, న్యూస్‌టుడే: దేశంలో మహిళలపై జరుగుతున్న దాడుల్ని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ ఆరోపించారు. స్థానిక బోడేపూడి భవన్‌లో ఎస్.వెంకటరమణ అధ్యక్షతన ఐద్వా మండల, పట్టణ మహాసభ బుధవారం నిర్వహించారు. పని ప్రదేశాల్లోనే కాకుండా కుటుంబంలోనూ వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తేజావత్ వజ్రమ్మ, గౌర్రాజు ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: దేశంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరవైందని ఐద్వా రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి అన్నారు. సత్తుపల్లిలో బుధవారం ఐద్వా మహాసభను నిర్వహించారు. సమావేశంలో రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, లక్ష్మి, కవిత, ఝాన్సీ పాల్గొన్నారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

గాలి దుమారం.. కూలిన చెట్లు



గాలి దుమారంతో కూలిన రేకుల షెడ్డు

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలో బుధవారం గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడితో అల్లాడిన జనానికి ఉపశమనం లభించింది. దుమారం తీవ్రతకు రెండు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో విద్యుత్తు స్తంభాలు విరిగాయి. సుమారు రెండున్నర గంటల విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో జనం ఇబ్బంది పడ్డారు. గాలి దుమారానికి పలు రేకుల షెడ్లు కూలిపోయాయి. హోర్డింగులు దెబ్బతిన్నాయి.

'ఐలు' నగర కమిటీ ఎన్నిక

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఖమ్మం నగర కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పబ్బతి రామబ్రహ్మం, కార్యదర్శిగా పి.కిశోర్ బాబు, సభ్యులుగా గద్దల దిలీప్, బిల్లా శ్రీనివాసరావు, పి.శ్రీలక్ష్మి, దుర్గ, శివ, వినయ్, షరీఫ్, రవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొల్లి సత్యనారాయణ, మందడపు శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నల్లమల నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్, జక్కంపూడి నాగేశ్వరరావు, తన్నీరు పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నామా పరామర్శ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: తెదేపా ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు కుతుంబాక బసవ నారాయణ కుటుంబాన్ని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఖమ్మం నగరంలోని ఆయన ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఎగవేతదార్లకు ముకుతాడు

నగరంలోని గోపాలపురంలో ఓ వ్యక్తి మూడేళ్ల క్రితం తన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని అందులో నివాసం ఉంటున్నా... ఇటీవలే ఇంటి నంబర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడింది.

నగరంలోని ముస్తఫానగర్‌లో ఓ వ్యక్తి మూడంతస్తుల అనుమతి తీసుకొని ఇంటి నెంబర్ వచ్చిన అనంతరం నాలుగో అంతస్తు నిర్మాణం పూర్తి చేసుకొని దానికి ఆస్తిపన్ను చెల్లించకుండా నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పెడుతున్నారు. ఉన్న అరకొర సిబ్బందితో ఇక్కడ పరిశీలించలేని పరిస్థితి నగరపాలక సంస్థది. దీంతో రూ.లక్షల ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఇలా ఒక్కరిద్దరు కాదు.. వేలాది మంది ఆస్తి పన్ను చెల్లింపుల విషయంలో అధికారులను పక్కదోవ పట్టిస్తున్నారు. కొంతమంది సిబ్బంది వారు తీసుకుని ఇంటి పన్ను మదింపులో యజమానికి అనుకూలంగా చేయడం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికే పురపాలకశాఖ ఉన్నతాధికారులు సొంత వనరులను పెంచుకోవాలని, తద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఖమ్మం నగరపాలకంలో పలు ఇళ్లకు, ప్రభుత్వ భవనాలకు సైతం నాలుగైదేళ్లుగా ఆస్తి పన్ను లేకపోవడం వంటి విషయాన్ని రెవెన్యూ సిబ్బంది సైతం పట్టించుకోకపోవడం నగరపాలకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ తరుణంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించారు. రానున్న రోజుల్లో విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ఆస్తి పన్ను పక్కాగా లెక్కగట్టేందుకు చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు.

పునః పరిశీలనకు ప్రైవేటు ఏజెన్సీ

నగరంలో ప్రస్తుతం ఉన్న ఇళ్లు:	78,250
నివాస గృహాలు:	70,750
నివాసేతర గృహాలు:	3,850
మిక్స్‌డ్:	3,650
ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో ఆదాయ లక్ష్యం:	రూ.32 కోట్లు

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని ఇళ్లను, వాటికున్న అనుమతులు, నిర్మాణం చేపట్టిన అంతస్తులను పునః పరిశీలించే బాధ్యతలను ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించాలన్న చర్చలు ప్రారంభమయ్యాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ఓ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ఏజెన్సీ నగరపాలక సంస్థలోని ప్రతి ఇంటిని పరిశీలించడం, వారు చెల్లిస్తున్న ఇంటి పన్నుకు, ఇంటికి మధ్య వ్యత్యాసం ఉంటే వాటి ద్వారా ఆస్తిపన్ను మదింపు చేసే అవకాశం ఉంది. ఈ మదింపుతో రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు ఆదాయం పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



ఖమ్మం కమాన్‌బజార్: గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులు



కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...



ఖానాపురం హవేలి: కాల్వొడ్డులో తెదేపా నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

బాపూ సన్మార్గం చూపు!

బృందం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. డీసీసీ కార్యాలయంలో గాంధీ, లాలబహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీ నారాయణ, పోట్ల నాగేశ్వరరావు నివాళులర్పించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భవనంలో గాంధీజీ చిత్రపటానికి సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, వేలాద్రి, రమేశ్ నివాళులర్పించారు. టీఎన్జీఓ సంఘం కార్యాలయం ఆవరణలో సంఘం ప్రతినిధులు కొణిదెన శ్రీనివాస్‌రావు, జయపాల్, శ్రీకాంత్ తదితరులు నివాళులర్పించారు. కాల్వొడ్డులో తెదేపా నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు నివాళులు అర్పించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య నివాళులర్పించారు. 'స్వచ్ఛతా హీ సేవ'లో మంచి పని తీరును కనబరిచిన కార్మికులను సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. భారాస కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు నివాళులర్పించారు. **రఘునాథపాలెం** గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. వి.వెంకటాయపాలెంలో డీపీఎల్‌ఓ రాంబాబు పాల్గొన్నారు.

పాలేరు నియోజకవర్గంలో...

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యాలయ బాధ్యుడు శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీపీ బానోతు శ్రీనివాస్, సీతారాములు, నాయకులు ఉన్నారు. **తిరుమలాయపాలెం** మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు తదితర కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్ గౌడ్, ఎస్సై జగదీశ్, తహసీల్దారు వెంకటరామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పాల్గొన్నారు. **కామేపల్లిలో** గాంధీ జయంతిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. **నేలకొండపల్లిలో** ఎంపీడీవో యర్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వారి కార్యాలయాల్లో నివాళి అర్పించారు.



ఖమ్మం నగరం: గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీజీఓ నాయకులు



టీఎన్జీఓ భవన్‌లో నివాళులు అర్పిస్తున్న టీఎన్జీఓ ఉద్యోగులు



ఖమ్మం కార్పొరేషన్: భారాస కార్యాలయంలో సండ్ర, కొండబాల నివాళి



ఖమ్మం కార్పొరేషన్: ఉత్తమ కార్మికులతో అభిషేక్ అగస్త్య

మహాత్ముడికి సీపీ నివాళి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం పోలీసు కమిషనర్ కార్యాలయంలో గాంధీ జయంతి బుధవారం నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి సీపీ సునీల్‌దత్ పూలమాల వేసి నివాళులర్పించారు.



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీ సునీల్‌దత్, అధికారులు

గాంధీ చిత్రపటానికి విన్నపం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: చేయూత పింఛన్ ఇప్పించాలని కోరుతూ పలువురు దరఖాస్తుదారులు బుధవారం గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి వినతిపత్రాలు ఇచ్చి తమ నిరసన తెలిపారు. 25వ డివిజన్‌లోని గాంధీపార్కులో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.



చిత్రపటానికి వినతిపత్రం సమర్పిస్తున్న అర్హులు

ఖమ్మం ఓవరాల్ ఛాంపియన్



క్రీడల్లో పాల్గొన్న అటవీశాఖ సిబ్బంది

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో నిర్వహించిన అటవీశాఖ జోనల్ క్రీడల్లో ఖమ్మం జిల్లా 45 పాయింట్లు సాధించి, పలు గేమ్‌లు, అథ్లెటిక్స్, ఈవెంట్స్‌లో గెలుపొంది ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో పాటు అధికారులు, సిబ్బంది పతకాలు సాధించి బహుమతులను అందుకున్నారు.

బదిలీ సమస్యలపై సీఎండీకి వినతి పత్రం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: విద్యుత్ ఉద్యోగుల బదిలీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీయూఈఈయూ, సీఐటీయూ నాయకులు సీఎండీ వరుణ్ రెడ్డిని కలిసి బుధవారం వినతి పత్రం సమర్పించారు. వరంగల్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నలవాల స్వామి, ఎం.ప్రసాద్, జి.సుధాకర్, ఆర్.వెంకటేశ్వరరావు ఉన్నారు.

★ విద్యుత్ శాఖలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని తెఈఈ 1104 యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు అన్నారు. ఖమ్మంలో బుధవారం సంఘ కార్యాలయంలో ప్రాంతీయ అదనపు కార్యదర్శి పి.సురేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా'లో నవోదయ విద్యార్థులు



జలాశయం వద్ద నవోదయ ఎన్‌సీసీ క్యాడెట్లు

కూసుమంచి, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేకువజామునే గ్రామంలో ప్రభాత భేరీ నిర్వహించి పరిశుభ్రతకు సంబంధించి నినాదాలతో గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గ్రామంలో, పాలేరు జలాశయం పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు. మిషన్ భగీరథ పథకం పంపు హౌస్ వద్ద వ్యర్థాలను సేకరించారు. విద్యాలయ ప్రధానాచార్యుడు కె.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకట్రావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కె.లక్ష్మీప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్.ప్రసాద్‌బాబు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గ్రంథపాలకు జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా ఎల్.ఫణికుమార్, కోశాధికారిగా ఎ.మోహన్, ఉపాధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి, మహిళా కార్యదర్శిగా కె.రమాదేవి, సంయుక్త కార్యదర్శిగా గురవయ్య ఎన్నికయ్యారు.



భారాస కార్యాలయంలో నృత్యాలు చేస్తున్న మహిళలు



స్త్రీశిశు సంక్షేమ శాఖ వేడుకల్లో మేయర్ నీరజ, సిబ్బంది

వాడవాడలా పూల వేడుక

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'కలవారి కోడలు ఉయ్యాలో... కనకమహాలక్ష్మి ఉయ్యాలో.' రామరామరామ ఉయ్యాలో... శ్రీరామ రాముడే ఉయ్యాలో'... 'చిత్తూచిత్తుల బొమ్మ... శివునీ ముద్దుల గుమ్మ' అంటూ వర్షపు జల్లులో నృత్యాలు చేస్తూ మహిళలు ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలు నిర్వహించుకున్నారు. బుధవారం సాయంత్రం సంబురాలు ప్రారంభమవుతాయనుకున్న సమయంలో ఒక్కసారి ఆకాశం మేఘావృతమై, ఈదురుగాలులతో వర్షం కురిసింది. మహిళలు నిరాశ చెందారు. వర్షం ఆగిపోవడంతో చిరుజల్లుల నడుమే బతుకమ్మ నృత్యాలు చేస్తూ తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. బుర్హాన్‌పురం ఆంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ శీలంశెట్టి రమ, విజయనగర్‌కాలనీలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి, నగరంలోని భారాస కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భారాస నాయకులు గుండాల కృష్ణ పాల్గొన్నారు.



బతుకమ్మను తెస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మీప్రసన్న

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: రాజేశ్వరపురం, చెన్నారం విద్యుత్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిర్వహణ చేపట్టనున్నారు. దీంతో గురువారం ఉదయం 8 గంటల నుంచి 2 వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ వెంకన్న తెలిపారు.

వీధి దీపాలకు మరమ్మతులు: నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మోటాపురంలో వీధి దీపాలను బుధవారం అమర్చారు. గతంలో పాడైన వాటి స్థానంలో ప్రతిసారీ కొత్తవి అమరుస్తుండగా తాజాగా వాటికి మరమ్మతులు చేయించి వాడారు. దీంతో సుమారు 100 విద్యుత్ బల్బుల కొనుగోలు ఖర్చు మిగిలింది. దీంతో పంచాయతీ నిధులు కార్యదర్శి నాగస్వరూప్‌రెడ్డిని, ఎలక్ట్రీషియన్ నరేష్‌ను గ్రామస్థులు అభినందించారు.

చీరలు వితరణ: ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు సిబ్బందికి చీరలు వితరణగా అందించారు. తన భార్య స్వర్ణలత గుర్తుగా శానిటేషన్ సిబ్బందికి బుధవారం వాటిని పంపిణీ చేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్: ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు గుడిపల్లి సునితకు వరంగల్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసశర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.



దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలి: ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్వచ్ఛమైన రాజకీయాలు చేయదలుచుకున్న యువతరం సీపీఎంలోకి రావాలని, దేశ రాజకీయాల్లో వారు కీలకపాత్ర పోషించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం యువజన రంగం జిల్లా కేంద్ర మహాసభలో పాల్గొన్నారు. నాయకులు రమేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

★ 40వ డివిజన్ మహాసభల ప్రారంభ సూచికగా బుధవారం అరుణ పతాకాన్ని ఎగురవేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బుర్రి వెంకటేశ్వర్లు, విక్రమ్, ప్రకాష్, శోభారాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తప్పనిసరిగా ఉంచాలి: తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. దమ్మాయిగూడెంలో బుధవారం ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఏఓ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం: ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయుడుపేటలో బుధవారం నిర్వహించారు.

పిల్లల సంరక్షణకు అధిక ప్రాధాన్యం



సంతకాల సేకరణలో డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: పిల్లల సంరక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మహిళా శిశు వికలాంగ వయోవృద్ధుల సంక్షేమశాఖాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో 'చిన్నారి' ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ఛైల్డ్‌లైన్ హెల్ప్ డెస్క్ వద్ద పసిపిల్లల సంరక్షణపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛైల్డ్‌లైన్ 1098 నంబర్ ద్వారా అవసరమైన సాయాన్ని పొందవచ్చని సూచించారు. బాలల సంరక్షణ కమిటీ ఛైర్‌పర్సన్ భారతీ రాణి, డీసీపీఓ విష్ణువందన, రైల్వే, ఛైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వ నమోదు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలోని గాంధీ చౌక్, కమాన్‌బజార్ ప్రాంతాల్లో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. భాజపా రాష్ట్ర నాయకుడు సన్నే ఉదయ్ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు వాణిజ్య, వ్యాపారవర్గాలను కలిసి పలువురికి పార్టీ సభ్యత్వం అందించారు. మొబైల్ ద్వారా పార్టీ సభ్యులుగా చేర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రాజేశ్, సాత్విక్, సంజయ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: దసరా సెలవుల దృష్ట్యా ప్రజలు దొంగలతో అప్రమత్తంగా ఉండాలని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ ఒక ప్రకటనలో బుధవారం సూచించారు. సెలవులకు వెళ్లేవారు చుట్టూ పక్కల వారికి సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

వయోవృద్ధులకు అండగా న్యాయ సేవాసంస్థ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: వయోవృద్ధుల రక్షణ, పోషణ, వారి ఆరోగ్య సంరక్షణపై జిల్లా న్యాయ సేవాసంస్థ అండగా ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి కె.వి.చంద్రశేఖర్‌రావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రుల పోషణకు పిల్లలు నిరాకరిస్తే న్యాయ సేవాసంస్థ ద్వారా తగిన న్యాయ సహాయం అందిస్తామని జడ్జి తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ పర్యవేక్షకుడు శ్రీధర్ పాల్గొన్నారు.



అభినందన: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తమ ఒలింపియాడ్ విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, పక్కనే ప్రిన్సిపల్ శర్మ తదితరులు



వేడుకలు: ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి తదితరులు

- ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: సుర్దేపల్లి సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్(35) కొత్తూరు-సుర్దేపల్లి గ్రామాల మధ్య రహదారి వారగా పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. శరీరంపై స్వల్ప గాయాలతో పక్కనే ద్విచక్ర వాహనం పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు చూశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనుమానాస్పదంగా మృతి చెందాడని లక్ష్మణ్ తల్లి రాణాలో ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు..

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: తల్లంపాడుకు చెందిన కురుకుంట్ల గోపి(45) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. బుధవారం నగరానికి రాగా ముస్తఫా నగర్ వద్ద ఇతని ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గిరిజన తండాలో బాలికను లోబర్చుకున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేశారు. తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడంటూ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుణ్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

పెట్రోల్ కల్తీ అయిందని ఆందోళన

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: బొక్కలగడ్డ ప్రాంతానికి చెందిన నాగరాజు తన బుల్లెట్ బండికి పెట్రోల్ కొట్టించాడు. కొద్ది దూరం వెళ్లి ఆగింది. అనుమానం వచ్చి వేరే సీసాలో పెట్రోల్ నింపించుకున్నాడు. నీరులా ఉండటంతో సిబ్బందిని గట్టిగా ప్రశ్నించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు జిల్లా సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు నమూనాలను తీసుకున్నారు. అనుమానం ఉన్న రెండు పంపులను సీజ్ చేశారు.